RNI: TELTEL12215

https://youtube.com/@UstudioTV
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com





RANGAREDDY, EDITION : 01, VOLUME :167 EDITOR: CHERUKU UPENDAR, DATE : WEDNESDAY 01 NOVEMBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 167 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : బుధవారం 01 నవంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

# బాబుకు బెయిల్

- వైద్యం కోసం 4 వారాలకు షరతులతో అనుమతి
- జైలు నుండి విడుదల
- కార్యకర్తల ఘన స్వాగతం
- రాజమహేంద్రవరం నుండి అమరావతికి రోడ్డుమార్గంలో ప్రయాణం
- మద్యంకేసులో 28 వరకు అరెస్ట్ చేయం : సిఐడి



అమరావతి- ప్రభాత సూర్యుడు

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడకు హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. నాలుగు వారాల పాటు షరతులతో కూడిన బెయిల్‌ను ఇస్తూ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లిఖార్జునరావు మంగళవారం తీర్పు ఇచ్చారు. దీంతో రాజమండ్రి సెంట్రల్ జైలు నుండి సాయంత్రం ఆయన విడుదలయ్యారు. బాబు కుటుంబసభ్యులు లోకేష్, బ్రహ్మణీ, బాలకృష్ణలతో పాటు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, ఇతర నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో టిడిపి కార్యకర్తలు ఆయనకు జైలు వద్ద స్వాగతం పలికారు. కార్యకర్తల నుద్దేశించి కొద్దిసేపు మాట్లాడిన అనంతరం చంద్రబాబు రాజమహేంద్రవరం నుండి అమరావతికి రోడ్డుమార్గంలో ప్రయాణ మయ్యారు. అంతకుముందు చంద్రబాబు అనారోగ్య పరిస్థితులను దఅష్టిలో పెట్టుకుని మద్యంతర బెయిల్‌ను షరతులతో మంజూరు చేస్తున్నట్లు న్యాయమూర్తి ఉత్వర్వుల్లో ఆయన స్పష్టం చేశారు. నవంబర్ 27వ తేది వరకు బెయిల్ అమలులో ఉంటుందని, 28వ తేది లంగిపోవాలని పేర్కొన్నారు. ప్రధాన బెయిల్ పిటిషన్‌పై 10వ తేదీన విచారణ చేస్తామని వెల్లడించారు. చంద్రబాబు సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని, కాబట్టి ఆయన వెంట ఇద్దరు సిఐడి డిఎస్‌పిలు ఉండేందుకు అనుమతించాలంటూ సిఐడి చేసిన అభ్యర్థనను న్యాయమూర్తి తోసిపుచ్చారు. బెయిల్ గడువు ముగిసే 28 వ తేది వరకు మద్యం కేసులో చంద్రబాబును అరెస్ట్ చేయబోమని ధర్మాసనానికి సిఐడి తెలిపింది.



# ఇందిరమ్మ రాజ్యం రావాలి

కొల్లాపూర్ సభలో రాహుల్ గాంధీ

మహబూబ్‌నగర్ - ప్రభాత సూర్యుడు

బీఆర్ఎస్, బీజేపీలు తెలంగాణ ప్రజలను దోపిడీ చేశాయి. వచ్చే ఎన్నికల్లో ఆ రెండు పార్టీలను పాతరపెట్టాలి. సీఎం కేసీఆర్ కుటుంబం ఒకవైపు.. ప్రజలు ఒకవైపు ఉన్నారు.. దోచుకున్నదాన్నంతా కాంగ్రెస్ అధికారంలోకొచ్చాక కక్కిస్తాం..” అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో మంగళవారం పాలమూరు ప్రజాపోరు సభ డీసీసీ అధ్యక్షులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అధ్యక్షతన జరిగింది. సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీకి, అమ్మ సోనియమ్మకు రాష్ట్ర ప్రజలు అండగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ఆరు గ్యారెంటీలు అమలు కావాలంటే ఇందిరమ్మ రాజ్యం రావాలని అన్నారు. నాకు

మిగతా 2లో

# కాంగ్రెసోళ్ల మాటలు నమ్మొద్దు

## సాగర్ ఎడమకాల్వకు నీరు విడుదల : ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్





హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఓటు వేసేటప్పుడు అభ్యర్థి వ్యక్తిత్వం, మనస్తత్వం గుర్తుంచుకోవాలి. అతను ఏ పార్టీ నుంచి పోటీ చేస్తున్నాడో ఆ పార్టీ చరిత్ర, దృక్పథం, సరళిని దష్టిలో ఉంచుకోని ఓటు వేయాలి అని సీఎం కేసీఆర్ అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, దేవరకొండ పట్టణకేంద్రాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం ప్రసంగించారు. కాంగ్రెస్ వాళ్లకు పదవులు వస్తే చాలు ప్రజలు ఎటుపోయిన వారికి అవసరం లేదన్నారు. వారి పాలనలో ప్రజలు ఎన్ని కష్టాలు పడ్డారో మీరే ఆలోచించాలన్నారు. బీఆర్ఎస్ వచ్చిన తర్వాత ప్రజల కష్టాలు ఒక్కొక్కటి తీరుస్తూ ముందుకు పోతున్నామని తెలిపారు. కాంగ్రెస్ వాళ్లు ఎన్నికలు వస్తే గోల్మాల్ చేసి ఓట్లు వేయించుకోవాలని చూస్తారు. వారిని నమ్మకండి అని పిలుపునిచ్చారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టును కట్టవలసిన చోట కాకుండా ఆంధ్ర పాలకులకు అవసరం ఉన్న చోట కట్టారని, అనాడు తెలంగాణ ప్రాంత కాంగ్రెస్ నాయకులు ఏం చేస్తున్నారని

మిగతా 2లో



# కేసీఆర్ సీఎం కావాలి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ అభివృద్ధి మోడల్... దేశానికి దిక్సూచి లాంటిదని అన్నారు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో తెలంగాణ అభివృద్ధి మోడల్‌పై ఆమె మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అతి తక్కువ సమయంలో తెలంగాణ అత్యంత వేగంగా అభివృద్ధి చెందిందని చెప్పారు. తెలంగాణ సమ్మిళిత, సమగ్ర అభివృద్ధి సాధించిందని వివరించారు. పరిపాలనలో మానవీయ కోణాన్ని సీఎం కేసీఆర్ ఆవిష్కరిస్తున్నారని

మిగతా 2లో



# నంబర్ వన్ నియోజకవర్గంగా కామారెడ్డి

## మంత్రి కేటీఆర్

కామారెడ్డి- ప్రభాత సూర్యుడు


కామారెడ్డి నియోజకవర్గ మాచారెడ్డి మండల భారత రాష్ట్ర సమితి కార్యకర్తల సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు పాల్గొన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ కెసిఆర్ కామారెడ్డి లో పోటీ చేస్తున్నారనగానే ప్రతిపక్షాలు నీరుగారిపోయాయి. పోటీ చేసేందుకు వెనుకాడూతూ పారిపోయే ప్రయత్నం చేస్తున్నాయి. మొదటి రోజు నుంచి తెలంగాణ ఉద్యమ జెండా ఎగిరిన గడ్డ కామారెడ్డి. అందుకే ఇయాల కామారెడ్డిలో కేసీఆర్ పోటీతో

మిగతా 2లో

# మీ అభిమానాన్ని మరిచిపోలేను

- టిడిపి అధినేత నారా చంద్రబాబు
- బెయిల్‌పై రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి విడుదల
- స్వాగతర పలికేందుకు తరలచ్చిన టిడిపి శ్రేణులు





రాజమహేంద్రవరం- ప్రభాత సూర్యుడు

'నాపై మీరు చూపిన అభిమానం ఎప్పటికీ మర్చిపోలేను' అని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో జ్యుడీషియల్ రిమాండ్ ఖైదీగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో 52 రోజుల పాటు ఉన్న ఆయనకు హైకోర్టు షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది. దీంతో, మంగళ ˊవారం సెంట్రల్ జైలు నుంచి చంద్రబాబు విడుదల య్యారు. బెయిల్ మంజూరు కావడంతో ఉదయం నుంచే టిడిపి శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. నగరంలోని లోకేష్ క్యాంపు కార్యాలయంతోపాటు జిల్లాలో పలుచోట్ల బాణసంచా కాల్చుతూ, స్వీట్లు పంచుతూ సంబరాలు నిర్వహించారు. బెయిల్ నేపథ్యంలో సెంట్రల్ జైలు వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో సెంట్రల్ జైలుకు

మిగతా 2లో



# ఎన్నికలకు సీఆర్‌పీఎఫ్ బలగాలు

**న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు:** ఐదు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం దాదాపు 1,700 కంపెనీల కేంద్ర భద్రతా బలగాలు , రాష్ట్ర పోలీసు బలగాలను మోహరించే అవకాశం ఉందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మిజోరంలలో నవంబర్ 7 నుంచి 30 వరకు ఎన్నికలు జరగనున్నాయి. కాగా డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరగనుంది. నక్సల్స్ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌లో మాత్రమే రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఇందులోభాగంగా నవంబర్ 7న 20 స్థానాలకు, నవంబర్ 17న 70 స్థానాలకు పోలింగ్ జరగనుంది. ప్రధాన అంతర్గత భద్రతా దళం సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) బలగాల మోహరింపును సమన్వయం చేస్తుందని వర్గాలు తెలిపాయి. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్‌ఎఫ్), ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ), సశాస్త్ర సీమా బల్ (ఎస్‌-ఎస్‌బీ), సెంట్రల్ ఇండిస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఆర్ఎఫ్) ,సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్) వంటి కొన్ని ప్రత్యేక పోలీసు విభాగాలతో పాటు స్థానిక పోలీసులు బలగాలు ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో ఉన్న సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) యూనిట్లకు అదనంగా 400 అదనపు కంపెనీలను మోహరిస్తుంది.

# నంబర్ వన్ నియోజకవర్గంగా కామారెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపక్షాల పరిస్థితి పోచమ్మ గుడి ముందు గొర్రె పొట్టేలును కట్టేసినట్లు తయారయిందని అన్నారు. ఇవాళ కామారెడ్డి నియోజకవర్గం రాష్ట్రంలో నంబర్ వన్ నియోజకవర్గం అవుతుందని కామారెడ్డి ప్రజలు నమ్ముతున్నారు. ఇంకా కామారెడ్డిలో అఖండ మెజార్టీతో కెసిఆర్ విజయం ఖాయం. గంప గోవర్ధన్ స్వయంగా కేసీఆర్ ను పోటీ చేయాలని కోరిన నేపథ్యంలో కెసిఆర్ కామారెడ్డిలో పోటీ చేస్తున్నారని అన్నారు. కొడంగల్ లోనే ఓడిపోయి పారిపోయిన రేవంత్ రెడ్డి, కామారెడ్డికి వచ్చి గెలుస్తానని అంటుండు. కొడంగల్ లో మా ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి పైనే గెలవలేని రేవంత్ రెడ్డి, కేసిఆర్ పై పోటీ చేస్తారని బీరాలు పలుకుతుండని విమర్శించారు.కామారెడ్డిలో రేవంత్ రెడ్డి పోటీ చేస్తే డిపాజిట్ గల్లంతు చేసి ఉద్యమ వేడి చూపిస్తాం. బలిసిన కోడి చికెన్ సెంటర్ ముందుకొచ్చి తొడగొట్టినట్టు రేవంత్ రెడ్డి పరిస్థితి ఉంది. 11సార్లు అవకాశం ఇచ్చిన ఏం చేయలేని కాంగ్రెస్ పార్టీ... మరొక్కసారి అవకాశం అడుగుతుంది. ప్రతిదానికీ ఢిల్లీ వెళ్లి తెల్చుకునే కాంగ్రెస్ పార్టీ, బిజెపిలు మనకెందుకు. గతంలో రైతులు వ్యవసాయానికి, కరెంట్ కోతలతో కష్టాలు పడింది మర్చిపోవద్దు. అందరికీ మనం ఒక్కసారి కాంగ్రెస్ చీకటి రోజులు రావన్న, రైతులు అర్ధరాత్రి బోర్ల దగ్గర పండుకునే పరిస్థితి రావాల్నా ఆలోచించాలని అన్నారు. రానున్న 30 రోజులపాటు భారత రాష్ట్ర సమితి ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పార్టీని ఘనంగా గెలిపించుకోవాలి. ఎవరి గ్రామాల్లో వారు పార్టీ పథకాలను ప్రభుత్వం సాధించిన ప్రగతిని, భవిష్యత్తులో అందించే సంక్షేమ కార్యక్రమాలను, ప్రతి ఒక్కరికి తెలిపి మెజార్టీ తీసుకువచ్చేలా చూడాలని అన్నారు.

# మీ అభిమానాన్ని మరిచిపోలేను

(మొదటిపేజీ తరువాయి)

తరలి వచ్చిన టిడిపి శ్రేణులను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అయినప్పటికీ పోలీసుల ఆంక్షలను దాటుకుని టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సెంట్రల్ జైలు వద్దకు చేరుకున్నారు. టిడిపి జెండాలు చేతబూని చంద్రబాబుకు జేజేలు పలికారు. టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్, ఆయన భార్య బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్, సినీనటుడు, హిందూపురం ఎంఎల్ఎ నందమూరి బాలకృష్ణ, టిడిపి జిల్లా రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. సాయంత్రం 4.15 గంటలకు చంద్రబాబు జైలు నుంచి బయటకు వచ్చారు. అప్పటికే గేటు వద్ద ఎదురు చూస్తున్న తన కుటుంబ సభ్యులను పలకరించడంతోపాటు మనవడు దేవాన్ష్‌ను అలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి శ్రేణులు, అభిమానులను ఉద్దేశించి చంద్రబాబు మాట్లా డారు. తనకు సంఘీభావం తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్య వాదాలు తెలిపారు. తన కోసం పూజలు, ప్రార్ధనలు చేశారని, ఈ అభిమానాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగానూ, ప్రపంచవ్యాప్తంగానూ సంఘీభావం తెలిపాం న్నారు. తాను ఏ తప్పూ చేయలేదని, తప్పులను కూడా చేయనివ్వనని పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి కుప్పం వరకూ సైకిల్ యాత్ర చేసి అభిమానం చాటా రన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం తనకు మద్దతు తెలపడాన్ని మరువలేనని చెప్పారు. సంఘీభావం తెలిపిన రాజకీయ పార్టీలకూ ఆయన ధన్యవాదాలు తెలిపారు. పవన్‌కల్యాణ్‌కు ప్రత్యేక ధన్య వాదాలు అని చంద్రబాబు అన్నారు. అనంతరం రాజమహేంద్ర వరంలోని క్యాంపు ఆఫీసుకు వెళ్లారు. అక్కడి నుంచి అమరావతికి బయలు దేరారు. చంద్రబాబుకు స్వాగతం పలికిన వారిలో మాజీ మంత్రులు కెఎస్ జవహర్, పీతల సుజాత, టిడిపి రాష్ట్ర నాయకులు కొమ్మారెడ్డి పట్టాభిరాం, వర్ల రామయ్య, పయ్యావుల కేశవ్ తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ రాజ్యం రావాలి

(మొదటిపేజీ తరువాయి)

మరో మీటింగ్ ఉన్నా.. సోదరి ప్రియాంకగాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టడం కోసం తాను కొల్లాపూర్ సభకు హాజరైనట్టు తెలిపారు. అనారోగ్య కారణాల వల్ల చివరి నిముషంలో ప్రియాంకగాంధీ హాజరు కాలేకపోయారని, అందుకే తాను వచ్చినట్టు వివరించారు. 'మనది రాజకీయబంధం కాదు, కుటుంబబంధం' అంటూ ప్రజలనుద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో ప్రజాస్వామిక వాదులు గెలుపొందుతారని రాహుల్‌గాంధీ ధీమా వ్యక్తం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం పేరుతో ధరణి తెచ్చి ప్రభుత్వ భూములన్నింటినీ కొల్లగొడుతున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బొంద పెట్టడం ఖాయమన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి రాష్ట్రంలో లక్ష కోట్లు మెక్కాయని ఆరోపించారు. బంగారు తెలంగాణ పేరుతో అధికారంలోకి వచ్చి అప్పుల తెలంగాణగా మార్చారని, ఇప్పుడు ప్రతి వ్యక్తి ఏడాదికి 31 వేలు చెల్లించినా అప్పు తీరదన్నారు. కాంగ్రెస్ హయాంలోనే జూరాల, సింగూర్, శ్రీశైలం, నాగార్జునసాగర్, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం వంటి భారీ ప్రాజెక్టులు నిర్మించామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ కట్టిన బ్యారేజ్ కుంగిపోయింది.. కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టులను చూడండి.. కాళేశ్వరం ప్రాజెక్టును చూడండి.. ఇదే కాంగ్రెస్ పనితీరుకు నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు భూములను పంచితే బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని గుంజుకుంటోందన్నారు. రెవెన్యూ, ఇసుక, మందు శాఖల ద్వారా వచ్చే కోట్ల రూపాయలు కేటీఆర్ కుటుంబానికి పోతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతుబంధు రద్దు చేస్తారనే ప్రచారంలో వాస్తవం లేదన్నారు. రైతు భరోసా పేరుతో రైతులందరికీ ఎకరాకు ఏడాదికి రూ.15000, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు రూ.12000 చెల్లిస్తామన్నారు. మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. మహిళలను గౌరవిస్తూ ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ఒకో ఇంటికి ఐదు లక్షలు, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు.

# కేసీఆర్ సీఎం కావాలి

(మొదటిపేజీ తరువాయి)



తెలిపారు కవిత. సీఎం కేసీఆర్‌ను అభినవ చాణక్యగా అభివర్ణించారామె. అహింసా మార్గంలో తెలంగాణను సాధించిన గాంధీ అని కొనియాడారు. ఒకప్పుడు బీడువారిన భూములను పచ్చని పంటపొలాలుగా తీర్చిదిద్ది దేశానికి సీఎం కేసిఆర్ స్ఫూర్తినిచ్చారని అన్నారు.ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష కేసీఆర్‌తో సాధ్యమైందని... అందుకోసం సుదీర్ఘ పోరాటం సాగిందని చెప్పారు. 2001లో కేసీఆర్ తెలంగాణ పోరాటాన్ని ప్రారంభించారని.. 2004లో అప్పటి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అంశాన్ని కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌లో చేర్చిందని గుర్తు చేశారు కవిత. ఆ తర్వాత కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని ఉద్ధృతం చేయడంతో 2009లో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని... చివరికి 2014లో ప్రత్యేక రాష్ట్రం సాకారమయ్యిందని వివరించారామె. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన కేసీఆర్ సర్కార్.. రాష్ట్రాన్ని అభివృద్ధి బాట నడిపించిందని చెప్పారు. ప్రకృతి ఇచ్చిన వనరులను సద్వినియోగం చేసుకోవడంలో తెలంగాణ ముందుందని చెప్పారు కల్వకుంట్ల కవిత. తెలంగాణ శాంతిసామరస్యానికి ప్రతీక అని.... రాష్ట్రం ఏర్పడిన తర్వాత మతకల్లోలాలు జరగలేదని గుర్తుచేశారు. తెలంగాణ మోడల్ అంటే ఆర్థిక గణాంకాలు కాదని... మారిన తెలంగాణ జీవన స్థితిగతులని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతుల్యం పాటిస్తూ కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ముందుకెళ్తోందన్నారు. సీఎం కేసీఆర్.. తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలోని 10 జిల్లాల్లో 9 వెనుకబడిన జిల్లాలుగా ఉండేవని, రైతుల ఆత్మహత్యల్లోనూ తెలంగాణ రెండో స్థానంలో ఉండేదన్నారు. 2వేల 700 మెగావాట్ల విద్యుత్తు కొరత ఉండేదని, కరెంట్ సరఫరా లేక పరిశ్రమలను వారంలో రెండు రోజులపాటు మూసివేసేవారని గుర్తుచేశారు. తాగునీటి ఎద్దడి కూడా తీవ్రంగా ఉండేదన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్.... సమూలమైన సంస్కరణలు చేసి నాటి పరిస్థితులను పూర్తిగా మార్చేశారని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రంలో విద్యుత్తు మిగులు సాధించామని.. ధాన్యం ఉత్పత్తిలోనూ తెలంగాణ రెండో స్థానానికి చేరిందని చెప్పారు కవిత. 2014-15నుంచి 2022-23 మధ్యకాలంలో జీడీపీ 118.2 శాతం పెరగగా.... తెలంగాణ రాష్ట్ర స్థూల ఉత్పత్తి 155.7 శాతం పెరిగిందని తెలిపారు. అంటే జాతీయ సగటుకు మించి తెలంగాణ పయనిస్తోందన్నారు కవిత. జీఎస్డీపీలో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో ఉందని స్పష్టం చేశారు. తలసరి ఆదాయంలోనూ ఇతర రాష్ట్రాలకు మించి తెలంగాణ దూసుకెళ్తోందన్నారు. దీన్ని భట్టి... అందరికి సమాన సందప విధానాన్ని సీఎం కేసీఆర్ అవలంభిస్తున్నారన్నది అర్థమవుతోందని అన్నారామె. తెలంగాణ వ్యవసాయం పండగలా మారిందన్నారు కల్వకుంట్ల కవిత. రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందన్నారు. అంతేకాదు... రైతు బంధు పేరుతో ఏటా ఎకరానికి రూ.10 వేల చొప్పున ఇప్పటి వరకు 65 లక్షల మంది రైతులకు రూ.72,815కోట్లు అందించామని చెప్పారు. ఎక్కడా లేని విధంగా రైతులకు ఉచితంగా సాగునీరు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆరే అన్నారు కవిత. రైతాంగానికి 24 గంటల పాటు ఉచితంగా విద్యుత్తు అందిస్తున్నమన్నారు. ధరణి పోర్టల్ ద్వారా భూరికార్డులను కంప్యూటరీకరణ చేపట్టి విప్లవాత్మక మార్పుకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. మిషన్ కాకతీయ కింద చెరువులకు మరమ్మత్తు చేసుకోవడం వల్ల.. రాష్ట్రంలో చెరువులు నిండుకుండాలా ఉన్నాయని.. భూగర్భజలాలు పెరిగి మత్స్య సంపద పెరిగిందన్నారు. మూడున్నరేళ్లలో ప్రపంచంలోనే అతి పెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దుక్కుతుందన్నారు. ఆ ప్రాజెక్టు వల్ల రైతులు మూడు పంటలు పండిస్తున్నారన్నారు.సాగు విస్తీర్ణం 1.31 లక్షల ఎకరాల నుంచి 2 కోట్లకుపైగా ఎకరాలకు పెరిగి.. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో ఉందని చెప్పారు కవిత. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తయితే మరో 50 లక్షల ఎకరాలు సాగులోకి వస్తుందని అన్నారు. బలమైన విధానాలు రూపొందించడం వల్ల ఇవన్నీ సాధ్యమయ్యాయని చెప్పారామె. 2014లో రూ.62లక్షల కోట్లుగా ఉన్న రాష్ట్ర బడ్జెట్ ఇప్పుడు రూ.2 లక్షల 94 వేల కోట్లకు చేరుకుందన్నారు. తాగునీటిపై రాష్ట్ర ప్రభుత్వం రూ.36వేల కోట్లు ఖర్చు చేసిందని... మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఇంటికి నల్లా కనెక్షన్ కల్పించామన్నారు. 2014లో 7,778 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తయ్యేదని.. కానీ ఇప్పుడు 18453 మెగావాట్లను ఉత్పత్తి చేసే సామర్థ్యానికి తెలంగాణ చేరుకుందన్నారు. పర్యావరణ సవాళ్లను అధిగమించడానికి 280 కోట్ల మొక్కలు నాటామని.. ప్రతీ గ్రామంలో నర్సరీని నెలకొల్పామని చెప్పారు. పారిశ్రామికాభివృద్ధిలోనూ తెలంగాణ దూసుకెళ్తోందన్నారు కవిత. పరిశ్రమల ఏర్పాటుకు టీఎస్ ఐపాస్ విధానం ద్వారా కేవలం 15 రోజుల్లోనే అనుమతులు ఇస్తున్నామని చెప్పారు. 2014 నుంచి ఈ ఏడాది జనవరి వరకు రూ.3.31 లక్షల కోట్ల పెట్టుబడులతో 22,100 పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని.. దీని వల్ల 22 లక్షల 36 వేల పరోక్ష ఉద్యోగాలను సృష్టించామన్నారు. యాపిల్, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఫేస్ బుక్, అమెజాన్ వంటి బహుళజాతి కంపెనీలు కూడా తమ యూనిట్లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశాయని చెప్పారు కవిత. సీఎం కేసీఆర్ దూరదృష్టితోనే ఇంత వృద్ధి సాధ్యమైందని కొనియాడారామె. వైద్య రంగంలోనూ తెలంగాణ ఎంతో పురోగమించిందని చెప్పారు. విద్యారంగంలోనూ సమూల మార్పులు తీసుకొచ్చామని.. 10 వేల మెడికల్ సీట్లను పెంచామన్నారు. ప్రతీ జిల్లా ఆస్పత్రికి అనుబంధంగా మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు కవిత. మహిళా సాధికారతకు ఎంతో కృషి చేస్తున్నమని చెప్పారు కవతి. పార్లమెంటు ఆమోదించిన తర్వాత కూడా మహిళా రిజర్వేషన్ల చట్టం అమలు కావడం లేదన్నారామె. మహిళా రిజర్వేషన్ల బిల్లు పోస్ట్ డేటెడ్ చెక్కు లాంటిదని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్... మహిళా రిజర్వేషన్ చట్టం ద్వారా రాజకీయ ప్రయోజనాలు పొందాలని ప్రయత్నించిందని విమర్శించారు. ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల నుంచే చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్లు వచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కేంద్రానికి చిత్తశుద్ధి లేదని, అన్ని పార్టీలు డిమాండ్ చేసినా ఓబీసీ కోటా కూడా కల్పించలేదని తప్పుబట్టారు కవిత.

# కాంగ్రెసోల్ల మాటలు నమ్మొద్దు

(మొదటిపేజీ తరువాయి)

కోదాడ సభలో తానంటే, ఉత్తమకుమార్‌రెడ్డి ఎగిరి పడుతున్నాడని అన్నారు. అలూ లేదు సూలు లేదు ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే నేనంటే నేనే ముఖ్యమంత్రినని డజన్ మంది ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాహుల్‌కు ఎద్దు ఎగసం ఉందో లేదో తెలియదు కానీ ఆయన ధరణి వద్దంటున్నాడన్నారు. అవి ఉంటే వద్దనడని అన్నారు. ఎమ్మెల్యే కోరిక మేరకు సాగర్ ఎడమ కాలువకు అధికారులతో చర్చించి నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. పంజాబ్‌ను తలదన్నే విధంగా 3 కోట్ల టన్నుల ధాన్యం పండించే స్థాయికి తెలంగాణ రాష్ట్రం చేరుకున్నదని, రేషన్‌కార్డు దారులందరికి సన్నబియ్యం అందించి పేదల ఆకలి తీరుస్తామన్నారు. కాంగ్రెస్ వాళ్లకు బుద్ధి లేకుండా మాట్లాడుతున్నారని ,వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. దళితుల్లో ఆత్మవిశ్వాసం ఉండేందుకు దళిత బంధు తెచ్చామన్నారు. కాంగ్రెస్ నాయకులు కోర్టు స్టే తేవడం వల్లనే డిండి లిఫ్టు పనుల్లో ఆలస్యం జరిగిందన్నారు. కొద్ది నెలల క్రితమే ఆ చిక్కులు పోయాయి అన్నారు. త్వరలో దిండి లిఫ్టు పనులు పూర్తయితే దేవరకొండ దరిద్రం పోతుందన్నారు.

మా తండాలలో మా రాజ్యం -మా పరిపాలన అనే విధంగా తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేశామన్నారు. ఓ మంచి వ్యక్తిని గెలిపించుకుంటే అంతా మంచే జరుగుతదన్నారు. తెలంగాణ వచ్చిన పది సంవత్సరాల కాలంలో తెలంగాణాల్లో కర్ఫ్యూలు, మత కల్లోలాలు లేవని కేసీఆర్ అన్నారు. మేము ఏనాడూ అరాచకాలు చేయలేదన్నారు. లౌకికవాదానికి తమ పార్టీ నిదర్శనమని ,ముస్లిం సమాజం ఆలోచించాలని కోరారు. కెసిఆర్ బతుకున్నంతకాలం సెక్యురిలిజం కోసం బతికి ఉంటాడన్నారు. అభివద్ధికి ఆటంకం కలుగకుండా మరోసారి బిఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు.

# బాబుకు బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

**షరతులివి...**

బెయిల్ ఉత్తర్వుల్లో ఐదు షరతులను పేర్కొన్న ధర్మాసనం, సిఐడి దాఖలు చేసిన మెమోను పరిశీలించిన అనంతరం మరికొన్ని షరతులను చేర్చింది. తొలుత పేర్కొన్న షరతుల ప్రకారం కేసు విచారణ చేస్తున్న విజయవాడ ఎసిబి కోర్టులో లక్ష రూపాయల విలువైన రెండు పూచీకత్తులను సమర్పించాలి. నచ్చిన ఆస్పత్రిలో సొంత ఖర్చులతో వైద్యం చేయించుకోవచ్చు. సరెండర్ అయ్యే సమయంలో చికిత్సతో పాటు ఆస్పత్రి వివరాలను జైలు సూపరింటెడెంట్‌కు సీల్డ్ కవర్‌లో సమర్పించాలి. ఆ కవర్‌ను జైలు సూపరింటెండెంట్ ఏసీబీ కోర్టుకు నివేదించాలి. పిటిషనర్ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కేసు విచారణను ప్రభావితం చేసే ఎటువంటి పనులను చేయకూడదు. నవంబర్ 28వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎదుట లంగిపోవాలని 16 పేజీల ఉత్తర్వుల్లో హైకోర్టు పేర్కొంది. మరికొన్ని షరతులు చేర్చాలంటూ సిఐడి మెమో దాఖలు చేయడంతో ఉత్తర్వుల జారీ అనంతరం సిఐడి మెమో దాఖలు చేయడంతో మెమోపై విచారణ బుధవారం చేపడతామని, అప్పటి వరకు చంద్రబాబు మీడియాతో మాట్లాడకూడదని, ర్యాలీల్లో పాల్నకూడదని, ఇంటర్వ్యూలు ఇవ్వకూడదని పేర్కొంటూ విడిగా మరో ఆదేశాలను జారీచేసింది. హైకోర్టు ఆదేశాలు విడుదల కాగానే మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, టిడిపి పొలిట్‌బ్యూ చెరో లక్ష రూపాయల పూచీకత్తును ఎసిబి కోర్టుకు సమర్పించారు.

**ఆరోగ్య సమస్యల కారణంగానే...**

ఆరోగ్య సమస్యల కారణంగానే చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు న్యాయమూర్తి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బెయిల్‌ను వ్యతిరేకిస్తూ సిఐడి చేసిన వాదనలను ఆయన తోసిపుచ్చారు. 'గత జూన్ 21 నుంచి ఆరు నెలల్లోగా కుడి కంటికి కాటరాక్ట్ ఆపరేషన్ చేయించుకోవాలని చంద్రబాబు వైద్యులు సిఫార్సు చేశారు. ఆపరేషన్ కోసమే బెయిల్ ఇవ్వాలని చంద్రబాబు కోరుతున్నారు. ఆయన వయసును కూడా పరిగణనలోకి తీసుకున్నాం, వఅద్ధాప్యంలో అనారోగ్య సమస్యలు సహజం. దీనికి మెడికల్ బోర్డు ఎదుట హాజరయ్యేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ సిఐడి చేసిన వాదన ఆమోదయోగ్యంగా లేదు. ఇదే సమయంలో స్కిల్ కేసులో సిఐడి ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని సుప్రీంకోర్టులో వేసిన వ్యాజ్యం బెయిల్‌కు అడ్డంకికాదు. సుప్రీంకోర్టు తీర్పు చెప్పే వరకు బెయిల్ పిటిషన్‌ను విచారించవద్దని సిఐడి వాదించడం సబబు కాదు. నిందితులపై నేరారోపణల తీవ్రత కంటే వాళ్ల ఆరోగ్యం ముఖ్యం. దర్యాప్తులో భాగంగా జ్యుడిషియల్ కస్టడీలో మాత్రమే బాబు ఉన్నారు. పిటిషనర్ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పుడు బెయిల్ మంజూరుకు యోగ్యులు. బెయిల్ మంజూరు చేసినప్పటికీ న్యాయ ప్రక్రియ నుంచి తప్పించుకునే ఆస్కారం ఏమాత్రం లేదు. సీఎంగా చేశారు. విపక్ష నేతగా ఉన్నారు, ప్రజలతో గట్టి సంబంధాలు ఉన్న వ్యక్తి . దేశం విడిచి పారిపోతారనేందుకు అస్కారమే లేదు. అన్ని అంశాలను లోతుగా పరిశీలించిన తర్వాతే 4 వారాలపాటు బెయిల్ మంజూరు చేస్తున్నాం.' అని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

**మద్యం కేసులో....**

మద్యం కేసులో నిందితుడిగా ఉన్న టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడును నవంబరు 28 వరకు అరెస్టు చేయబోమని హైకోర్టుకు సిఐడి హామీ ఇచ్చింది. చంద్రబాబును మూడో నిందితుడిగా చేర్చుతూ సిఐడి నమోదు చేసిన మద్యం కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఆయన దాఖలు చేసిన వ్యాజ్యాన్ని మంగళవారం హైకోర్టు విచారణ జరిపింది. చంద్రబాబు తరపు సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదిస్తూ స్కిల్ కేసులో బెయిల్ వచ్చిన వెంటనే మద్యం కేసులో అరెస్టు చేయాలనే కుట్రలో ప్రభుత్వం ఉందన్నారు.

# సంపాదకీయం

## బీజేపీనీ భయపెడుతున్న ధరలు

నిత్యావసర ధరలు ఆకాశాన్ని తాకడంతో, సామాన్యుడి కొనుగోలు శక్తి దారుణంగా క్షీణించింది. కనీసం కడుపునిండా తిండి తినే పరిస్థితి కూడా కనిపించడం లేదు. 2014లో బియ్యం కిలో 27 రూపాయలు ఉంటే ఇప్పుడు 52 రూపాయలకు పెరిగింది. ఉల్లిపాయలు రూ. 17 ఉంటే కొన్ని మహానగరాల్లో ఇప్పుడు 80కి చేరింది. గోధుమపిండి రూ. 22 ఉంటే ఇప్పుడు 60కి చేరింది. ఇలా ఉప్పు, పప్పు వంటివి సైతం పెరిగాయి. మొన్నటి వరకూ టమోటా ధరలు 'మోత' మోగించగా, ఇప్పుడు మార్కెట్లో ఉల్లిగడ్డ ధర కొండెక్కి కూర్చున్నాయి. గత నెలరోజుల వ్యవధిలో ఉల్లి ధర దాదాపు రెట్టింపు అయింది. దేశవ్యాప్తంగా సగటు ఉల్లి ధర 57 శాతం పెరిగింది. కేంద్ర వ్యవసాయ శాఖకు, మార్కెట్ వ్యవస్థ మధ్య సమన్వయం లేకపోవడంతో వ్యవసాయ ఉత్పత్తులపై వాటి కొరతలపై సరైన అంచనాలు లేవు. మార్కెట్ ధరల పరిశోధన, అధ్యయనం శాస్త్రీయంగా లేవు. ప్రతిసారి మార్కెట్ అంచనాలు స్థిరంగా ఉండటం లేదు. కోలుకోలేని దెబ్బలకు విలవిల్లాడుతున్నారు. నిరు పేద మధ్యతరగతి ప్రజలపై ప్రతిరోజు ఏదో ఒక నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల భారం పడుతూనే ఉంది. ఇప్పటికే గ్యాస్ సిలిండర్ 2014లో రూ.399 ఉంటే ఇప్పుడు రూ.955కి పెరిగింది, రూ.71, రూ.55గా ఉన్న పెట్రోల్, డీజిల్ ధరలు మోదీ పాలనలో ఏకంగా సెంచరీని దాటేసాయి. 2014 నుంచి ఇప్పటిదాకా బీజేపీ డీజిల్ పై 512 శాతం, పెట్రోల్‌పై 194 శాతం చొప్పున ఎక్సైజ్ పన్నులు పెంచేసింది. దీంతో రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలకు రెక్కలొచ్చాయి .ఎన్నికల సమయంలో బీజేపీ ప్రభుత్వం జిమ్మిక్కులు మామూలుగా లేవు. సరిగ్గా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల రానున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం సిలిండర్ ధరలను కొంత మేర తగ్గించింది... బీజేపీ చేతలన్నీ కేవలం ఎన్నికల వ్యూహాలే తప్ప ప్రజల సంక్షేమంపై నిబద్ధత కానరాదు. ఎంతసేపు కార్పోరేట్లకు మేలు చేకూర్చడమే తప్ప సామాన్య ప్రజల అగచాట్లను ముఖ్యంగా పేదల మధ్యతరగతి ప్రజలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నిరుద్యోగం, ఉపాధి కరువు దానితో పాటు ఈ ధరల పెరుగుదల పెను భారం మోసే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే రానున్న ఎన్నికలలో అధికార పక్షానికి సరైన గుణపాఠం చెబుతారు. కల్లబొల్లి మాటలతో అన్నిసార్లు సామాన్య ప్రజలను బోల్తా కొట్టించలేరు. ప్రజలు తమ నిత్య జీవిత అనుభవాల నుండి చైతన్యం పొందుతారు. సుదీర్ఘ ఉపన్యాసాలకు,శుష్క వాగ్దానాలకు, తాత్కాలిక తాయిలాలకు ఎంతో కాలం మోసపోరు.ఉదాహరణకు ఈ ఏడు ఖరీఫ్ పంట ఉత్పత్తి ఆలస్యం కావడంతో, ఉల్లి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని, వినియోగదారులు వాపోతున్నారు. మరొకవైపు ధరలను నియంత్రించే పేరుతో కేంద్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటోంది. బియ్యం, గోధుమలు, చక్కెర తదితర పంటలు మన దేశంలో బాగా పండినప్పుడు కొరత ఉన్న రాష్ట్రాలకు, ఇతర దేశాలకు ఎగుమతులపై నిషేధాలు, ఆంక్షలు విధిస్తుంది. దానితో మన రైతులకు తమ పంటలపై లాభాలు వచ్చే అవకాశాలను కోల్పోతున్నాడు. మన దేశాల ఎగుమతులపై విదేశాలు ఎక్కువ పన్నులను వసూలు చేస్తున్నాయి. ఆ విధంగా కూడా మన రైతులు నష్టపోతున్నారు. మన దగ్గర గోధుమలు, చక్కెర బాగా నిలువ ఉన్నప్పుడు అనాలోచితంగా అవే ఉత్పత్తులను రాయితీలు ఇచ్చి విదేశాల నుండి దిగుమతులు చేసుకుంటున్నారు. అప్పుడు విధిలేని పరిస్థితుల్లో తక్కువ ధరలకే మన ఉత్పత్తులను అమ్ముకొనే దుస్థితి మన రైతులకు దాపురించింది.ఈ ధరల పెరుగుదలతో కుటుంబ వ్యయం బాగా పెరుగుతుంది. నిత్యావసర ధరలతో ఒక సామాన్యుడి కుటుంబం తడిసి మోపెడు అవుతుంది. అంచనాలకు అందనంతగా ధరాఘాతంతో వారి బతుకులు అతలాకుతలం అవుతున్నాయి. ఓవైపు నిత్యావసర ధరలు పెరుగుతున్నా సామాన్యుడి ఆదాయం మాత్రం పెరగడం లేదు. కుటుంబానికి వస్తున్న నెలసరి ఆదాయానికి, ధరల పెరుగుదల కారణంగా అవుతున్న ఖర్చుకు ఏ మాత్రం పొంతన ఉండటం లేదు.

# కాంగ్రెస్ ది వసూళ్ల పార్టీ

- 24 గం. కరెంట్ ఇచ్చేది కేసీఆర్ కావాలా...5 గంటలిచ్చే కాంగ్రెస్ కావాలా
- మనది ప్రజల సంక్షేమ ప్రభుత్వం ఎమ్మెల్యే సంజయ్ కుమార్
- చల్గల్ నుండి ఎమ్మెల్యే సమక్షం లో 200 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరిక



**జగిత్యాల – ప్రభాతసూర్యుడు :** కాంగ్రెస్ పార్టీ ది ప్రజల నుండి పైసలు వసులు చేసిన పార్టీ అని, మనది ప్రజా సంక్షేమ ప్రభుత్వమని, కడుపులో ఉన్న బిడ్డ నుండి మొదలు కొని కాటికి పోయే వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం చల్గల్ గ్రామంలోని పలు కుల సంఘాలకు చెందిన పెద్దలు, మహిళలు, యువకులు 200 మంది యువకులు, అలాగే జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన యూత్ నాయకులు 30 మంది, అలాగే పట్టణంలోని టి ఆర్ నగర్, విద్యా నగర్ చెందిన పలువురు నాయకులు యువకులు ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ సమక్షం లో బీఆర్ఎస్ పార్టీలో చేరగా, ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ వారికీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్, బిజెపి లు పాలిస్తున్న రాష్ట్రాల్లో పెన్షన్ రూ 600 నుండి రూ. 1200 లకు మించి ఇవ్వడం లేదని, తెలంగాణ రాష్ట్రం లో మాదిరిగా ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. ప్రజల నుండి వసూళ్లు చేయడమే కాంగ్రెస్ వాళ్లకు తెలుసనీ, ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారని, కాంగ్రెస్ మోసపూరిత హామీలను నమ్మి మోసపోవద్దన్నారు. ఆరు గ్యారంటీల హామీతో కర్ణాటకలో అధికారం లోకి వచ్చి అమలు చేయక చేతులెత్తేశారని, 5 గంటల కరెంటు ఇచ్చే కాంగ్రెస్ ప్రభుత్వం కావాలా, లేక 24 గంటలు నిరంతర ఉచిత కరంటు ఇచ్చే కేసీఆర్ ప్రభుత్వం కావాలో అలోచించి నిర్ణయం తీసు కోవాలన్నారు.

సీఎం కేసీఆర్ రాష్ట్రం వచ్చిన తోలి నుండే రూ. 200 ఉన్న పెన్షన్ ను వెయ్యికి, వికలాంగులకు రూ. 1500 లకు పెంచారని, ఆ తర్వాత ఆసరా పెన్షన్‌ను రూ.2వేలకు, వికలాంగులకు రూ.3వేలకు పెంచారని, త్వరలో ఆసరా పింఛన్ ను రూ. 5 వేలకు, వికలాంగులకు రూ. 6 వేలు చెల్లిస్తామని మేనిఫెస్టోలో పెట్టామన్నారు. సౌభాగ్య లక్ష్మి పేరుతొ మహిళలకు రూ. 3వేళ పెన్షన్ ను, రైతు బీమా తరహాలోనే పేదలకు కేసీఆర్ బీమా అందిస్తామన్నారు. రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, మన ప్రభుత్వం ఎకరానికి రూ. 10 వేల పంట సహాయం అందిస్తున్నామని, త్వరలోనే దీనిని రూ. 16 వేలకు పెంచుతామన్నారు. తల్లి కడుపులో బిడ్డ పడగానే కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ నుండి మొదలు కొని బిడ్డ చదువుకోవడానికి గురుకులాలు, సన్నబియ్యం తో మధ్యాహ్న భోజనం, ఫీజు రీఎంబర్స్మెంట్, ఉగ్యోగలకు ఉచిత శిక్షణ, రైతు బందు, దళిత బందు, కల్యాణ లక్ష్మి, ఆరోగ్యలక్ష్మి, ఆసరా పింఛన్, బీడీ పింఛన్ వంటి సంక్షేమ పథకాలే కాకుండా చివరి మజిలీ కోసం వైకుంఠ ధామాల ను అభివృద్ధి చేశామన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దావా సురేష్, పాక్స్ ఛైర్మెన్ మహిపాల్ రెడ్డి,ఏఎంసీ వైస్ చైర్మన్ ఆసిఫ్,సర్పంచ్ గంగనర్సు రాజన్న,ఉప సర్పంచ్ పద్మ తిరుపతి ,గ్రామ శాఖ అధ్యక్షులు పూదరి శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ పులి శెట్టి శ్రీనివాస్, మాజీ ఏఎంసి డైరెక్టర్ మోహన్ రెడ్డి, తోట పోసమల్లు మహేష్ సంకర్తన్ మదు గంగారజం నాయకులు షకీల్, షేర్ ఫయాజ్,భీమ్, నవీన్, ముత్యం, లక్ష్మణ్ వెంకటేష్, గంగారాం శ్రీనివాస్, గంగాధర్,రాకేష్, శేఖర్,మండల మహిపాల్ అజయ్ ,ప్రభు,రాజు, హావేజ్,గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగీ రేసులో ఎవరు

**హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు :** పటాన్చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ టికెట్ ప్రకటించకపోవడంతో కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ లోకి వలసల బాట పట్టారు.కాంగ్రెస్ టికెట్ ఆశించినటువంటి కాటా శ్రీనివాస్ గౌడ్ కి అధిష్టానం ఇంకా టికెట్ ప్రకటించకపోవడం తో నిరాశకు లోనైనా కాటా ప్రధాన అనుచరుడు పటోళ్ల భాస్కర్ రెడ్డి పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సమక్షం లో బీఆర్ఎస్ పార్టీ లోకి చేరారు. ఆదివారం సాయంత్రం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పటాన్చెరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు విజయ భాస్కర్ రెడ్డి,మాజీ మున్సిపల్ అధ్యక్షులు పట్లోళ్ళ భాస్కర్ రెడ్డి వారి అనుచరులతో కలిసి ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ వ్యతిరేకి అయిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు చీదరించుకుంటున్నారని, రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో ఉనికి కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితులు కాంగ్రెస్ పార్టీకి ఏర్పడ్డాయని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు. 60 ఏళ్ల పాటు తెలంగాణను పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి చేసింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. 2009 ఎన్నికల్లో మేనిఫెస్టోను ప్రకటించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలోని ఒక్క హామీని కూడా అమలు చేయలేదని అన్నారు. నేడు ఆరు గ్యారెంటీ ల పేరుతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ముందుకు వస్తోందని అన్నారు. తెలంగాణ ప్రజలు విజ్ఞులని, కాంగ్రెస్ పార్టీ, బిజెపి పార్టీలను తరిమికొట్టడం ఖాయమని ఆయన అన్నారు.పటాన్చెరు లో జరిగిన అభివృద్ధి మా తారక మంత్రం అని అన్నారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో కాంగ్రెస్, బిజెపి పార్టీల నుండి భారీ సంఖ్యలో చేరికలు ఉండబోతున్నాయని తెలిపారు.పటాన్చెరు కాంగ్రెస్ పార్టీ లో నీలం మధు చేరికతో టికెట్ పోరు మొదలయింది. ఇప్పటికే కాంగ్రెస్ కు బలమైన నాయకుడుగా ఉన్నకాటా కి టికెట్ ఇస్తారా .. లేక నీలం మధు కు ఇస్తారా అని కాంగ్రెస్ కార్యకర్తలు డైలమాలో పడ్డారు.కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన రెండవ లిస్ట్ లో కూడా పటాన్చెరు అభ్యర్థి తేలకపోవడంతో, ఎవరికి టికెట్ వరిస్తుందా అని ఎటు తేల్చుకోలేని పరిస్థితి లో కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారు.దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రజలు ఉపాధి కోసం పటాన్చెరు నియోజకవర్గంలో జీవనం సాగిస్తున్నారని, వారందరినీ సొంత కుటుంబ సభ్యుల వలే చూసుకుంటూ వారి ఆర్థిక ప్రగతికి సంపూర్ణ సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే విజయానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఈసమావేశానికి హాజరైన ఉత్తరప్రదేశ్ మాజీ ఎమ్మెల్యే మనోజ్ కుమార్ ఠాకూర్ పిలుపునిచ్చారు.సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు.సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేపడుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాల ములంగా మినీ ఇండియా గా పేరొందిన పటాన్చెరు నియోజకవర్గంలో 29 రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో ఆనందంగా జీవనం సాగిస్తున్నారని తెలిపారు.ఎమ్మెల్యే జీఎంఆర్ హ్యాట్రిక్ విజయానికి సంపూర్ణ సహకారం లభించిందని ఆయన అన్నారు.

## సెంచరీ కొడుతున్న ఉల్లి

**హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు**



ఉల్లి ధరలు దేశ వ్యాప్తంగా పెరిగిపోయాయి.మొన్నటి వరకు కేజీ టమాటా రూ.200 వరకు పలకడంతో మధ్య తరగతి ప్రజలేవ్వరూ టమాటా లను కొనే దైర్యం చెయ్యలేదు.వాటి కోసం దొంగతనాలు, హత్యలు జరగడం కూడా ఇటీవలే కాలంలో చూశాం.అయితే ఇప్పుడు ఉల్లి ధర కూడా అదే రీతిలో ముందముందుకు సాగుతుంది. సాధారణంగా ఉల్లిని కోస్తే కన్నీళ్లు వస్తాయి కానీ ఇప్పుడు ఉల్లి ధరను చూసినా కన్నీల్లే వస్తున్నాయి.తెలంగాణలో పెరుగుతున్న ఉల్లి ధరను చూసి సామాన్యులు బెంబలెత్తిపోతున్నారు నెల రోజుల వ్యవధిలోనే ఉల్లి ధర రెండు సార్లు పెరిగింది.ప్రస్తుతం హైదరాబాద్ లో కేజీ ఉల్లి ధర రూ.80 ఉండగా హోల్సేల్ దుకాణాల్లో రూ.60-70 వరకు పలుకుతుంది. అయితే చిన్న వ్యాపారులు మాత్రం రూ.80-85 మధ్య విక్రయి స్తున్నారు. సాధారణ రోజుల్లో అయితే కేజీ ఉల్లి ధర రూ.20 వరకు పలికేది కానీ ఇప్పుడు 100 రూపాయిలు పెడితే కేవలం ఒక కేజి మాత్రమే వస్తుండటంతో జనం ఉల్లిని కొనేందుకు భయపడుతున్నారు.అయితే ఎలాంటి వంటల్లో అయిన అన్నిటికన్నా ఎక్కువగా వాడేది ఒక్క ఉల్లి మాత్రమే కనుక తప్పని పరిస్థితుల్లో అరకేజి,పావుకేజీ ఉల్లిని కొనుగోలు చేస్తున్నారు సామాన్య ప్రజలు.ఈసారి ఋతుపవనాలు ఆలస్యంగా రావడంతోనే ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయని వ్యవసాయ రంగం నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వర్షాభావ పరిస్థితులు ఉల్లి పంట పై తీవ్ర ప్రభావం చూపిందంటున్నారు. వర్షాలు లేక కొత్త ఉల్లి పంటలు ఆగిపోయాయని ,మార్కెట్ లో కొత్త ఉల్లి లేనందున ప్రస్తుతం ఉన్న ఉల్లి ధర గణనీయంగా పెరిగింది అని చెబుతున్నారు నిపుణులు.అయితే వర్షాకాలంలో కర్ణాటక రాష్ట్ర రైతులు ఉల్లిని భాగా పండిస్తారు అక్కడ నుండి తెలంగాణ కు సరఫరా చేస్తూ ఉంటారు.గత కొన్ని సంవత్సరాలుగా సకాలంలో వర్షాలు పడకపోవడంతో క్షేత్ర స్థాయిలో అటు కర్ణాటక ,ఇటు తెలంగాణ రైతు లేవ్వరు ఉల్లి సాగు కు ఆసక్తి చూపడం లేదు.ఈ క్రమంలోనే ఉల్లిని మహారాష్ట్ర నుండి కొనుగోలు చేస్తున్నారు.దీపావళి పండుగ వరకు ఇవే ధరలు కొనసాగుతాయని అంటున్నారు నిపుణులు.రానున్న రోజుల్లో కేజీ ఉల్లి ధర రూ.100 దాటిన ఆశ్చర్యపోన్నకర్లేదు అని నిపుణులు చెబుతున్నారు.

# టీ బీజేపీకి..దారేదీ...

**హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు :** తెలంగాణలో బీజేపీ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతున్నట్లుగా కనిపిస్తోంది. ఆ పార్టీకి ఒక్కరొక్కరుగా అగ్రనేతలు దూరం అవుతున్నారు. తెలంగాణలో అధికారమే తరువాయి అంటూ ఆర్భాటంగా ఇతర పార్టీల నుంచీ చేరికల కోసం ఏకంగా చేరికల క మిటీనే ఏర్పాటు చేసి, ఆ కమిటీ సారథ్య బాధ్యతలు మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటలకు అప్పగించినా కూడా.. ఆ పార్టీ ఇతర పార్టీల నుంచి వచ్చి చేరేవారికి విశ్వసనీయత కలిగిన ఆప్షన్ గా కనిపించడం లేదు సరికదా ఇప్పటికే పార్టీలో ఉన్న వారు కూడా మునిగిపోయే నావను ఎలా నమ్ముకుంటాం అనుకుంటున్నారో ఏమో ఒక్కరొక్కరుగా పార్టీని వీడుతున్నారు.అలా వీడుతున్నట్లు ప్రకటిస్తున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతూ వస్తోంది. ఇప్పటికే మునుగోడు ఉప ఎన్నికకు కారణమైన కోమటిరెడ్డి రాజగోపాల రెడ్డి పార్టీని వీడారు. ఆ సందర్భంగా ఆయన చేసిన ప్రకటన రాష్ట్ర బీజేపీ నాయకులకే కాదు, ఆ పార్టీ అధిష్ఠానానికి కూడా దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అయ్యేలా చేసింది. గతంలో తాను కాంగ్రెస్ కు రాజీనామా చేయడానికి కారణం.. తెలంగాణలో బీఆర్ఎస్ అవినీతి, కుటుంబ పాలనను అంతమొందించాలంటే అప్పట్లో బీజేపీయే సరైన పార్టీగా కనిపించిందనీ, అప్పట్లో కాంగ్రెస్ బీఆర్ఎస్ ను దీటుగా ఎదుర్కొనే పరిస్థితి లేదని భావించి, శాసన సభ్యత్వాన్ని కూడా వదులుకుని రాజీనామా చేసి బీజేపీలో చేరాననీ గుర్తు చేసిన ఆయన ఇప్పుడు బీజేపీని వీడడానికి కూడా అదే కారణం చెప్పారు. బీఆర్ఎస్ తో గట్టిగా తలపడుతుందని భావించిన బీజేపీ ఇప్పుడు ఆ పార్టీ పట్ల మెతక వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. ఆ కారణంగానే పార్టీ వీడుతున్నానని అన్నారు. ఈ వ్యాఖ్యలతో బీజేపీకి బీఆర్ఎస్ బీ టీమ్ అని వస్తున్న విమర్శలు, ఆరోపణలకు బలం చేకూర్చారు. ఇప్పుడు తాజాగా మాజీ ఎంపీ వివేక్ కూడా బీజేపీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ గూటికి చేరడానికి రంగం సిద్ధమైందని అంటున్నారు. రేవంత్ రెడ్డితో ఆయన దాదాపు గంటన్నర పాటు చర్చలు జరపడమే కాకుండా, అందుకు సంబంధించిన పొటో కూడా విడుదల చేయడంతో ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం ఖాయమని అంటున్నారు. మాజీ ఎంపీ వివేక్ సోదరుడు ఇప్పటికే బెల్లంపల్లి కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలో ఉన్నారు. మొయినాబాద్ లోని వివేక్ వ్యవసాయ క్షేత్రంలో జరిగిన రేవంత్, వివేక్ భేటీ ఫలవంతమైందనీ, ఆయన కాంగ్రెస్ గూటికి చేరడం ఇక లాంఛనమేనని రాజకీయవర్గాలు అంటున్నాయి. కాంగ్రెస్ ముక్త భారత్ నినాదంతో బీజేపీ తెలంగాణలో కాంగ్రెస్ ను నిర్వీర్యం చేయడానికి ఇంత కాలం అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తూ వచ్చిన బీజేపీకి ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యినట్లుగా కనిపిస్తోంది. బీజేపీ ముక్త తెలంగాణ దిశగా రాజకీయ పరిణామాలు మారుతున్నాయా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని పరిశీలకులు అంటున్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవం

**మంథని – ప్రభాత సూర్యుడు :** మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, చరిత్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ ఐక్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఆడెపు లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ భారతదేశంలో చిన్నా భిన్నంగా ఉన్న అనేక సంస్థానాలను విలీనం చేయడంలో విశిష్ట కృషి చేసిన వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ఆయన జన్మదినం సందర్భంగా మనం జాతీయ ఐక్యత దినోత్సవం జరుపుకుంటున్నామని



తెలిపారు. చరిత్ర విభాగం అధ్యాపకులు సతీష్ మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనం కావడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర మరువలేనిదని అన్నారు. వల్లభాయ్ పటేల్ యొక్క ధృఢ సంకల్పం వల్లనే నేడు భారతీ యులందరూ ఐకమత్యంతో ఉన్నారని అదే విధంగా విద్యార్థిని విద్యార్థులు వల్లభాయ్ పటేల్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులచే జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ కృష్ణ, గ్రంథ పాలకులు డాక్టర్ భరత్, అధ్యాపకులు అమర్నాథ్ ముకుందము, మానస ,రజిత బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆక్సిడెంట్ కి గురైన శివప్రసాద్ కుటుంబ సభ్యులకు అండగా మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి(బంటీ )



యాచారం - ప్రభాత సూర్యుడు : నందివనపర్తి గ్రామానికి చెందిన నందీశ్వరాలయ అర్చకులు సిద్దేశ్వర్ చిన్న కుమారుడు శివప్రసాద్ నగరం నుండి గ్రామానికి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. అనంతరం కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా వైద్యానికి సుమారుగా 6 లక్షల ఖర్చు అవుతుందని వైద్యులు తెలియజేసారు. పేద కుటుంబం కావడంతో గ్రామ మాజీ సర్పంచ్ వర్త్యావత్ రాజునాయక్ ఫండ్ రైసింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించి కొంత డబ్బును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇదే కార్యక్రమంలో బాగంగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఇబ్రహీంపట్నం యువనేత మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి ఇట్టి విషయాన్ని చేరవేశారు. వెంటనే స్పందించిన మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు 25,000 రూపాయలు గ్రామ ఉపసర్పంచ్ మూడెడ్ల గోవర్ధన్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొండాపురం శ్రీశైలం ద్వారా అందజేశారు. ప్రశాంత్ కుమార్ రెడ్డి చేసిన సహాయానికి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఆపద సమయంలో చేసిన సహాయాన్ని మరువలేమని తెలిపారు.

### ఆంజనేయ స్వామిని
## దర్శించుకున్న బిజెపి అభ్యర్థి కూన



కుత్బుల్లాపూర్ - ప్రభాత సూర్యుడు: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని, తెలంగాణ లో ప్రజా వ్యతిరేక కేసీఆర్ ప్రభుత్వం అంతం కావాలని కుత్బుల్లాపూర్ బిజెపి అభ్యర్థి కూన శ్రీశైలం గౌడ్ ఆంజనేయస్వామి కోరుకున్నట్లు ఆయన తెలిపారు. నర్సాపూర్ మండలంలోని చాకరమెట్ల శ్రీ శంకర ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గడ్డం రాజేందర్ రెడ్డి, ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జెకె శేఖర్ యాదవ్, ఏర్వ వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షులు గరిగే శేఖర్ ముదిరాజ్, డివిజన్ ఇంఛార్జ్ మోతె శ్రీనివాస్ యాదవ్, మహేందర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

### ప్రజలు స్వేచ్ఛ వాతావరణంలో
## ఓటు హక్కు వినియోగించుకోవాలి
### -కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి - ప్రభాత సూర్యుడు: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ అన్నారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, డిసిపిఎం.చేతన, రిటర్నింగ్ అధికారి మధు మోహన్ తో కలిసి పెద్ద మసీదు రోడ్డు నుంచి జెండా సెంటర్, కమాన్, అయ్యప్ప టెంపుల్, అమర్ నగర్, పెద్ద మసీదు వరకు కేంద్ర బలగాలతో నిర్వహించిన కవాత్కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ డిసిపి ఆధ్వర్యంలో ప్రజలకు భరోసా కల్పించే విధంగా కేంద్ర బలగాలతో కవాత్ నిర్వహిస్తున్నామని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలసమయంలో ప్రజలు స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా వారి ఓటు హక్కు వినియోగించుకునేందుకు, వారికి ధైర్యం కల్పించేందుకు కవాత్ నిర్వహిస్తున్నా మని అన్నారు. కేంద్రం నుండి వచ్చిన బలగాలు, మన పోలీస్అధికారులు సంయుక్తంగా జిల్లాలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారని, ప్రజలంతా ఎలాంటి భయభ్రాంతులు లేకుండా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా వారిఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేష్, సి.ఐ. అనిల్ కుమార్, ఎస్.ఐ. మహేందర్, పోలీస్ అధికారులు, కేంద్ర బలగాలు, తదితరులుపాల్గొన్నారు.

### మొకీల పోలీసు స్టేషన్ పరిధిలో
## కోటి 20 లక్షలు పట్టివేత

రంగారెడ్డి - ప్రభాత సూర్యుడు:

రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలం మోకిల శివారులో కోటి 20 లక్షలు కారులో తరలిస్తుండగా రెవెన్యూ అధికారులు మోకిలా పోలీసులు తనిఖీ లో డబ్బులను స్వాధీనం చేసుకున్నారు మోకిల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు దేవుళ్ళ నాయక్ సంబంధించి డబ్బులుగా గుర్తింపు శంకర్పల్లిలోని భూమి కొనుగోలు చేసేందుకు తన అనుచరునితో డబ్బులు పంపిస్తుండగా పోలీస్ తనిఖీల్లో పట్టుకున్నారు

## కూకట్ పల్లిలో టీడీపీ సంబరాలు

రంగారెడ్డి -ప్రభాతసూర్యుడు:

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మధ్యంతర బెయిల్ రావడంతో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల్లో ఆనందోత్సహాలు వ్యక్త మయ్యాయి సంబరాలు చేసుకున్నారు.

రోడ్ నెంబర్ వన్ లోని గాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేశారు టపాసులు కాల్చి సీట్లు పంచి పెట్టారు జై బాబు జై జై బాబు సైకో పోవాలి సైకిల్ రావాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు ఒకరికొకరు అభినందనలు తెలియజేసుకున్నారు రోడ్ నెంబర్ 1 నుండి రమ్య సెంటర్ వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఏచే నేరం చేయని చంద్రబాబు అరెస్టు అక్రమని ఇప్పటికైనా న్యాయం జరిగిందని కార్యకర్తల పేర్కొన్నారు.

# మర్రి నిరంజన్ రెడ్డి భవిష్యత్ కార్యాచరణ సమావేశం

ఇబ్రహీంపట్నం- ప్రభాతసూర్యుడు :

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని సాయి ఫంక్షన్ హాల్లో మంగళవారం నాడు టీపీసీసీ సభ్యులు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్రి నిరంజన్ రెడ్డి తన అనుచరులు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులతో కలిసి సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా మర్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ . చిన్న వయసులో సర్పంచిగా , ఎంపీటీసీగా ,ఎంపీపీగా , సేవలను, అందించాను కాంగ్రెస్ పార్టీ నమ్ముకున్న కార్యకర్తలకు అండగా నిలిచాను నాయకులకు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉన్నాను అనునిత్యం ప్రజలలో ఉండే నాయకుడిని గుర్తించకపోవడం చాలా బాధాకర విషయం అన్నారు, నాకు కాంగ్రెస్ పార్టీ టికెట్ రాకపోవడం చాలా బాధాకరం అన్నారు నాయకులు కార్యకర్తలు నాకు కాంగ్రెస్ పార్టీ టికెట్ రాలేదని ఎవరు కూడా అధైర్య పడోద్దని ఆన్నారు, కార్యకర్తలు నాయకులు నా అభిమానులు నిరాశ చెందోద్దు ఆన్నారు, కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మరోసారి పునరాలోచించి పార్టీ టికెట్, బి ఫామ్ తనకే కేటాయించాలన్నారు నియోజకవర్గ అభివృద్ధికి మరింత సేవ చేయడానికి అవకాశం కల్పించాలన్నారు, నిత్యం ప్రజలలో ఉండే నాయకుడికి కాకుండా ఎన్నికల సమయంలో తిరిగే నాయకులకు కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించడం చాలా బాధాకర విషయం అన్నారు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్న 23 సంవత్సరాలుగా ప్రజల సంక్షేమం కోసం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేశాన న్నారు, కొన్ని సంవత్స రాలుగా నియోజకవర్గంలో చదువుకునే విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించానన్నారు, కార్యకర్తలు నాయకులు ఎవరు ఏ ఆపదలో ఉన్న వారిని పరామర్శించి ఆర్థిక సాహాయం అందించి అండగా నిలిచాను అన్నారు, ఈ సంవత్సరం కూడా ఎలక్షన్స్ ముగిసిన వెంటనే విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ను విద్యార్థులకు అందిస్తానని తెలిపారు, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిని ప్రజలు కోరుకుంటున్నారు అని అన్నారు, కరోనా విపత్కర పరిస్థితిలో నియో జకవర్గంలో ఏ రాజకీయ పార్టీ నాయకుడు కూడా బయట తిరగలేదన్నారు, తాను నియోజకవర్గంలోని గ్రామపంచాయతీ సిబ్బందికి, ఫీల్డ్ అసిస్టెంట్లకు, ప్రైవేట్ స్కూల్ టీచర్స్ కి, ఆర్థిక సాహయంతో పాటు నిత్యవసర సరుకులు, కరోనా కిట్స్ అందించానని తెలిపారు, నా అనుచరులు, అభి మానులు, కార్యకర్తల సూచన మేరకు మరో రెండు రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమిడి శ్రీనివాస్ రెడ్డి, గజ్జి రామకృష్ణ, మచ్చ లక్ష్మణ్, దెంది రామిరెడ్డి , వెంకట్ రెడ్డి , మోతిరామ్ , కమలాకర్ రెడ్డి ఓరుగంటి మహేష్, నియోజకవర్గ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎంఎన్ఆర్ యువసేన సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# ఎంపీ ప్రభాకరరెడ్డి దాడికి కారణం అదేనా

మెదక్ -ప్రభాతసూర్యుడు : మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి కలకలం రేపుతోంది. గటాని రాజు అనే వ్యక్తి ఎంపీపై కత్తితో దాడిచేశాడని ప్రచారం జరుగుతోంది. ఇంతకీ గటానిరాజు ఎవరు? ఎందుకు ఎంపీపై హత్యాయత్నం చేశాడన్నది చర్చనీయాంశంగా మారింది. గటాని రాజు. యూట్యూబ్ చానళ్లలో పనిచేస్తున్నాడు. విలేకరి ముసుగులో పలు దందాలకు పాల్పడేవాడన్న ఆయనపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే... ఆయనకు ఎంపీ కొత్తప్రభాకర్‌రెడ్డిని చంపాలన్నంత కక్ష ఎందుకు అన్నదే ప్రజలకు అంతుబట్టడంలేదు. కాంగ్రెస్, బీజేపీ.. తమను రాజకీయంగా ఎదుర్కోలేక దాడులకుతెగబడుతున్నాయని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. గటాని రాజు కాంగ్రెస్ కార్యకర్త అని... ఇటీవలే బీజేపీలో చేరాడని బీఆర్ఎస్ నేతలు చెప్తున్నారు. అయితే గటని రాజు తమ కార్యకర్త కాదని.. బీజేపీ పార్టీకి చెందిన వాడని కాంగ్రెస్ వాదిస్తోంది. ఇక బీజేపీ విషయానికి వస్తే... ఎంపీపై దాడితో తమకు సంబంధం లేదని వాదించారు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందనరావు. గటాని రాజు కాంగ్రెస్ నేతలతో ఉన్న ఫొటోలను చూపించి... ఆయన కాంగ్రెస్ కర్యకర్తే అని స్పష్టం చేశారు. ఇంతకీ నిందితుడు గటాని రాజు ఎందుకు దాడి చేశాడు..? ఎవరైనా చెప్తే దాడి చేశాడా..? లేక.. ఇంకేదైనా కారణం ఉందా అన్నది తేలాల్సి ఉంది.మిరుదొడ్డి మండలం చెప్యాలకు చెందిన గటాని రాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కలప రవాణా చేసే వాహనాలను ఆపడం.. డబ్బులు వసూలు చేయడం వంటివి చేసేవాడని సమాచారం. అంతేకాదు కల్లు డిపోలు, షాపుల యజమానుల నుంచి కూడా డబ్బులు వసూలు చేసేవాడట. గటాని రాజు దౌర్జన్యాలు భరించలేక.. స్థానిక వ్యాపారులు అతనిపై దాడి కూడా చేసినట్టు తెలుస్తోంది. అయితే.. ఎంపీ కొత్తప్రభాకర్‌రెడ్డికి, గటాని రాజు మధ్య ఉన్న పంచాయతీ ఏంటి..? ఎంపీని హత్య చేయాలన్నంత కక్ష ఎందుకు అన్నదే అంతుపట్టడంలేదు చాలా మంది.ఇంటి స్థలం, దళితబంధు కోసం గటాని రాజు.... ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి దగ్గరకు వెళ్లినట్టు తెస్తోంది. ఇటీవల మిరుదొడ్డి మండల విలేకరులకు చెప్యాల క్రాస్‌రోడ్డులో ఇళ్ల స్థలాలు కేటాయించారు. అందులో తనకూ స్థలం కేటాయించాలని రాజు కోరగా.. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని అడగాలని అధికారులు సూచించారట. దీంతో రాజు చాలాసార్లు ఎంపీ దగ్గరకు వెళ్లి ఇంటి స్థలం కోసం అడిగాడని స్థానికులు చెప్తున్నారు. అయితే.. ఎన్నికల కోడ్ ఉన్నందున ఇప్పుడు సాధ్యం కాదని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి చెప్పి పంపారట. దీంతో రాజు కక్ష కట్టి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. అంతేకాదు... దళితబంధు కూడా ఇవ్వలేదన్న కోపం కూడా రాజుకు ఉందట. కావాలనే తనకు పథకాలు అందకుండా చేస్తున్నారన్న కోపం ఉన్న గటాని రాజు.. ఎంపీ కొత్తప్రభాకర్‌రెడ్డిపై కక్ష పెంచుకుని దాడి చేసి ఉండొచ్చని భావిస్తున్నారు.నిన్న ఎన్నికల ప్రచారంలో ఉన్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి జరగడంతో.. వెంటనే యశోద ఆస్పత్రిలో చేర్పించారు. మూడు గంటల పాటు ఆయనకు సర్జరీ చేశారు యశోద ఆస్పత్రి వైద్యులు. గాయం చిన్నదే అయినా తీవ్రత ఎక్కువగా ఉందని... కొత్త ప్రభాకర్‌రెడ్డి కోలుకోవడానికి సమయం పడుతుందని స్పష్టం చేశారు. నిన్న యశోద ఆస్పత్రికి వెళ్లి కొత్త ప్రభాకర్‌రెడ్డిని పరామర్శించారు సీఎం కేసీఆర్.

# మరువలేని మహిళా ప్రధాని ఇందిరా గాంధీ

కమాన్ పూర్ - ప్రభాత సూర్యుడు:

భారతదేశ ఉక్కు మహిళ తొలి మహిళా ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ వర్ధంతి దినోత్సవాన్ని పురస్కరించుకొని కమాన్పూర్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైనాల రాజు అధ్యక్షతన ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. స్వర్గీయ ఇందిరా గాంధీ ఈ దేశంలోని ఆర్థిక అస మానతలను రూపుమాపే విధంగా భారతదేశంలోని అట్టడుగు బడుగు బలహీన వర్గాలను ఆర్థికంగా రాజకీయంగా బలోపేతం చేసే దిశగా దేశంలో పలు సంస్కరణలు తీసుకురావడం జరిగింది ఇందులో భాగంగా భారతదేశంలోని అన్ని బ్యాంకులు జాతీయకరణ చేయడం జరిగింది ఎల్ఐసి లాంటి ప్రవేట్ రంగ ఇన్సూరెన్స్ సంస్థలను ప్రభుత్వ రంగ సంస్థలుగా తీసుకొచ్చి పేద బడుగు బలహీన వర్గాలకు ఇన్సూరెన్స్ పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది గరీబి హటావోతో ఈ దేశంలోని పేద ప్రజానీకానికి చేయూతనివ్వాలని పిలుపునిచ్చింది ప్రతి ఒక్కరికి కూడు గూడు గుడ్డ అందించాలని సంకల్పం తోటి ప్రతిక్షణం దేశ హితం కోసం పనిచేసింది అంతేకాకుండా దేశ సంరక్షణ కోసం మిలటరీ అన్వాయిదాలను సైతం ప్రపంచం అద్భుత పరిచే విధంగా తయారు చేయడం జరిగింది 1971 వ సంవత్సరంలో శత్రు దేశంగా భావించ బడు తున్నటువంటి దేశాన్ని రెండు ముక్కలుగా చీల్చి భారతదేశానికి హాని చేసే ఏ దేశాన్ని అయినా ఉపేక్షించేది లేదని ప్రపంచ దేశాలకు సగర్వంగా చాటి చెప్పింది ఇన్ని వందల సంవత్సరాలు జరిగినప్పటికీ అటువంటి వీరవనిత



నేటికీ పేద ప్రజల గుండెల్లో ఇందిరమ్మ స్థానం పదిలంగా ఉంది అని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమాన్పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు వైనాల రాజు జిల్లా జనరల్ సెక్రటరీలు రంగు సత్యనారాయణ ఆడెపు రమేష్ గాండ్ల మోహన్ జిల్లా కార్యదర్శి కోల నరస గౌడ్ మండల కన్వీనర్ సయ్యద్ అన్వర్ కమాన్పూర్ సీనియర్ నాయకులు ఎక్స్ ఎంపీపీ కోలేటి మారుతి కమాన్పూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు కొంతం శ్రీనివాస్ సర్పంచులు ఆకుల ఓదెలు తొగరి అశోక్ గారు మైనార్టీ సెల్ అధ్యక్షులు అప్సర్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుక్క రవి మండల ఉపాధ్యక్షులు భద్రపు శంకర్ చిగురు మొండయ్య మండల అధికార ప్రతినిధి చొప్పరి శేఖర్ యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు జెమిని మండల ప్రధాన కార్యదర్శి వడ్నాల శ్రీనివాస్ కొలిపాక శంకర్ గ్రామ శాఖ అధ్యక్షులు ఇరుగురాల శేఖర్ కోలా నరేందర్ బొంగోని సదన్న యాదగిరి రాజయ్య గ్రామ ఉపసర్పంచ్ లింగాల కుమార్ గుమ్మడి సతీష్ గుండారం గ్రామ అధ్యక్షులు పిడుగు శంకర్ జిల్లా మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సయ్యద్ ఇక్బాల్ జక్కుల శ్రీను గారు ఆర్ష ఎల్లయ్య దెబ్బేట రాజేష్ తాటికొండ శంకర్ జూలపల్లి గ్రామ గ్రామ ఎంపీటీసీ శివశంకర్ మాజీ ఎంపిటిసి బొల్లంపల్లి తిరుపతి గౌడ్ సీనియర్ నాయకులు ముత్యం తిరుపతి గడ్డం బాపు గడ్డం మధునయ్య గునిగంటి వెంకటస్వామి నీళ్ల లింగయ్య బర్ల నరసయ్య నాయకులు బొజ్జ సతీష్ దాసరి శంకర్ చిట్యాల రాయమల్లు అనవేనసది చొప్పరి శ్రీకాంత్ నీళ్ల సమ్మయ్య బండి రాజేశం వడ్లకొండ మనోహర్ చొప్పరి సంతోష్ ఎలా బోయిన తిరుపతి బండి శంకర్ సిద్ధి పల్లె యువజన నాయకులు బిల్లా వెంకటేష్ కుశన రవి బంగారు మహేష్ గారు అహ్మద్ చి క్కుల శ్రీను ఎలవే నా లక్ష్మణ్ మద్దెల రాజయ్య మట్ట శంకర్ మానుక స్వామి ప్రసాద్ నరేందర్ అనిల్ మారుతి సందీప్ శ్రీను చందు సాగర్ కిట్టు అనిల్ సాయి కృష్ణ శ్రవణ్ రంజిత్ నరేష్ మారుతి హరీష్ మరియు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215**